క్లుప్తంగా

ఆలయంలో మహా పూర్ణాహుతి



పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాసగిరి గుట్టపై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక కల్యాణ మహోత్సవం ముగిసింది. ఈ సందర్భంగా బుధవారం ఆలయంలో మహా పూర్ణాహుతి, చక్రస్నాన కార్యక్రమం నిర్వహించారు. భక్త సమాజ మండలి అధ్యక్ష కార్యదర్శులు ఆరుట్ల లక్ష్మణాచార్యులు, ధర్మపురి రాము, తాటికొండ శ్రీలత, మేదరమెట్ల శ్రీనివాస రావు, ఓం ప్రకాష్ మంత్రి, జిన్నె రమేష్, రాంజీ, ఆకుల సత్యవతి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై దృష్టి

పాల్వంచ: కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో సెక్యూరిటీ బాధ్యతలు నిర్వహిస్తున్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీస్ సిబ్బంది క్రీడలపై దృష్టి సారించారు. ఈ మేరకు కేటీపీఎస్ ఉద్యోగుల మాదిరిగా ఇక్కడి సిబ్బందికి ప్రతీరోజు సాయంత్రం ఎస్పీఎఫ్ గ్రౌండ్‌లో ఆటలు ఆడిస్తున్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ... క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక ధృడత్వానికి ఎంతో ఉపయోగపడుతాయని, సిబ్బందిని మరింత ఉత్తేజపరిచేలా ఆటలను ప్రాక్టీస్ చేయించేందుకు నిర్ణయం తీసుకున్నామని, సీతఈల సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

ఇంటిగ్రేటెడ్ గురుకులం నిర్మించాలి

ఇల్లెందురూరల్: మండలంలోని 21పిట్ ఏరియాలో ఇంటిగ్రేటెడ్ గురుకులం నిర్మించాలని కోరుతూ టీఎస్ఎస్ఎఫ్ నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకుడు చందావత్ రమేష్ మాట్లాడుతూ... పట్టణానికి అతిసమీపంలో సింగరేణి సంస్థ ఆధీనంలో ఉన్న 30 ఎకరాల స్థలాన్ని గురుకులం నిర్మాణానికి పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో రత్నాకర్, రాందాస్, నవీన్, శ్యాం తివారీ తదితరులు పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలంపాట

పాల్వంచరూరల్: మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో ఈనెల 28న శుక్రవారం టెండర్, బహిరంగ వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి చెందిన రెండు ఏసీ ఫంక్షన్ హాల్స్, కొత్త కాంప్లెక్స్‌లోని 4, 10 నంబర్ల షాపులకు మూడు సంవత్సరాల కాలపరిమితికి, అదేవిధంగా చీరల, బొమ్మలు, బల్లలు అమ్మకం కోసం సీల్డ్ టెండర్, బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా డీడీని జతపరిచి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

సోలార్ ప్లాంట్ తనిఖీ

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రామాంజనేయులు పర్యటించారు. బుధవారం సోలార్ ప్లాంట్‌లో పాటిస్తున్న భద్రత నియమాలను సోలార్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డ్స్, ఫైల్స్‌ను తనిఖీ చేశారు. సలహాలు, సూచనలు ఇచ్చారు. వార్డు రూమ్, బ్యాటరీ రూం, స్విచ్చింగ్ యార్డ్, ఇతర పని ప్రదేశాలను తనిఖీ చేశారు. ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (ఎస్‌టీపీపీ) శ్రీనివాస్, ఎస్ఈ కేశవరావు, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, ఎం.నాగరాజు నాయక్, డీజీఎం (ఏరియా వర్క్ షాప్) వీరా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి

సింగరేణి(కొత్తగూడెం): భద్రాచలంలో నిర్మాణంలో ఉన్న ఆరు అంతస్తుల భవనం కూలిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ అధ్యక్షుడు బ్రహ్మాచారి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాశిరకంగా భవనం నిర్మిస్తున్న యాజమాన్యం, పర్మిషన్ పంచాయతీ అధికారులపై కేసు నమోదు చేయాలని కోరారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు రూ.కోటి పరిహారం ఇప్పించాలని విన్నవించారు.

టీచర్లకు పూర్తి వేతనం ఇవ్వాలి

ఇల్లెందు: మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేసి నాలుగు నెలలు కావస్తున్నా పూర్తి స్థాయి వేతనం అందటం లేదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఇల్లెందు కూరగాయల మార్కెట్ ఎదుట మెయిన్ రోడ్ మీద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. తక్షణం వేతనాలు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈసం వెంకటమ్మ, కల్లెపల్లి మరియ, టి.కృష్ణ, సుల్తానా, ఆలేటి సంధ్య, అరుణ, పార్వతి, పద్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

దుమ్ము, ధూళితో చస్తున్నాం..!

- ప్రాణాలు పోతే కానీ పట్టించుకోరా..
- అమలు కాని ఎమ్మెల్యే ఆదేశాలు
- కలెక్టర్ ఆదేశాలైనా పాటిస్తారా?





దాసుతండాలో రోడ్డుపై లేస్తున్న దుమ్ము, టెంట్ వేసి నిరసన తెలియజేస్తున్న బాధితులు (ఫైల్)

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్ కాస్టుకు వెళ్లే వాహనాలతో ఎగిసిపడుతున్న దుమ్ముతో అనారోగ్యం పాలై ఆస్పత్రుల్లో చేరుతున్నామంటూ దాసుతండా గ్రామస్తులు సంవత్సరం నుంచి పదేపదే ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. టేకులపల్లి సెంటర్ నుంచి దాసుతండా వరకు రహదారి విస్తరించి డివైడర్ నిర్మిస్తూ సెంటర్ లైటింగ్ ఏర్పాటుకు గత ప్రభుత్వ హయాంలో 2023లో అప్పటి ఎమ్మెల్యే హరిప్రియ సీఎస్ఆర్ నిధులు రూ.2 కోట్లతో పనులను ప్రారంభించారు. కిలోమీటర్ వరకు రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్, డివైడర్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. మిగిలిన కిలోమీటర్ వరకు రోడ్డు వెడల్పు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు కూడా ప్రారంభించారు. దీని కోసం రోడ్డుకు ఇరువైపులా తవ్వి మిక్సింగ్ వేశారు. ప్రభుత్వం మారడంతో అకస్మాత్తుగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో ప్రతీ రోజూ దుమ్ము, ధూళితో రేగులతండా, దాసుతండా వాసులు ఇబ్బంది పడుతున్నారు. కేటీసీ నుంచి వచ్చిపోయే వాహనాల రాకపోకలతో ఎగిసిపడే దుమ్ముతో నానాయాతన పడుతున్న స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము, ధూళితోనే కాకుండా రోడ్డుపై పడిన గుంతలతో వాహనాలు దెబ్బతింటున్నాయి. సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్థానికులు దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఏడు నెలల క్రితం రోడ్డుని పరిశీలించి రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించాలని, దుమ్ము రాకుండా నీటిని చల్లించాలని పంచాయతీరాజ్ శాఖ, సింగరేణి అధికారులను ఆదేశించినప్పటికీ అధికారులు పట్టనట్టే ఉన్నారు. విసుగు చెందిన గ్రామస్తులు పలుమార్లు రోడ్డుపై వాహనాలు నిలిపి నిరసనలు తెలిపారు. దీంతో మొక్కుబడిగా రోడ్డుపై నీటిని పిచికారీ చేశారు. స్థానికులు సెప్టెంబర్ నుంచి రాస్తారోకో చేస్తూ వస్తున్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య రెండోసారి జోక్యం చేసుకున్నప్పటికీ అధికారులు ఆ ఒక్కరోజు మొక్కుబడిగా జేసీబీతో రోడ్డుకి ఇరువైపులా తవ్వించారు. మరుసటి రోజు నుంచి షరా మామూలే. దీంతో బాధితులు ఆదివారం మళ్లీ బొగ్గు లారీలను రోడ్డుపై నిలిపి నిరసన తెలియజేశారు. చాలామంది ఆస్పత్రి పాలయ్యారు. శ్వాసకోశ వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఎమ్మెల్యే చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం అయ్యేంత వరకు ప్రతీరోజు మూడు పూటలు నీటిని చల్లించాలని, రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని బాధితులు కోరుతున్నారు. ఇలా ఇప్పటికే సుమారు వందకు పైగా రాస్తారోకోలు, నిరసనలు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 19న రోడ్డుపై టెంట్‌వేసి వాహనాలు నిలిపి నిరసన తెలిపారు. తాజాగా మంగళవారం టేకులపల్లికి వచ్చిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్ వాహనాన్ని ఆపి రోడ్డు దుస్థితిని వివరించారు. ప్రజల గోడు విన్న కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. వారం రోజుల్లో రోడ్డు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటికే ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాలనే బేఖాతరు చేస్తున్న అధికారులు, కాంట్రాక్టర్, కలెక్టర్ ఆదేశాలు అమలు చేస్తారా లేదా.. బాధిత ప్రజల దుమ్ము కష్టాలు తీరేనా.. వేచి చూడాలి.



కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న స్థానికులు (ఫైల్)

ఇల్లంతా దుమ్ముతో నిండిపోతోంది..



దాసుతండాలో రోడ్డు పక్కనే మా ఇల్లు, దుకాణం ఉంది. రోడ్డు వెడల్పు చేస్తామని తవ్వి వదిలేశారు. బొగ్గు లారీల వల్ల దుమ్ము, ధూళి ఎగిసి పడి ఇంట్లోకి వస్తోంది. ఇంట్లో, దుకాణంలో సామగ్రిపై, తాగునీరు, తినే పదార్థాలు కూడా దుమ్ముతో నిండిపోతున్నాయి. ప్రతీరోజు దినదినగండంలా బతుకుతున్నాం. ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలి.

– బాణోతు ప్రవీణ్, బాధితుడు

అధికారులు స్పందించాలి..



రోడ్డు వెడల్పు కోసం పాత రోడ్డుని తవ్వి మధ్యలోనే నిలిపి వేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. మావి ప్రాణాలు కావా.. దుమ్ము, ధూళితో మా ప్రాణాలు పోవాల్సిందేనా. ఇప్పటికే చాలామంది అనారోగ్యం పాలయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలి.

– బాణోతు సురేష్, దాసుతండా

జర్నలిస్టులది న్యాయమైన డిమాండ్

కొత్తగూడెంఅర్బన్: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన డిమాండ్ న్యాయమైనదని సింగరేణి రిటైర్డ్ జీఎం ఎ.ఆనందరావు తెలిపారు. కొత్తగూడెంలోని గంగబిషన్ బస్తీలో జర్నలిస్టులు చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం ఏడో రోజుకు చేరగా, ఆయనతో పాటు సామాజికవేత్త బండి విజయ్‌భాస్కర్ తదితరులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. జర్నలిస్టులు దశాబ్ద కాలంగా ఇళ్లస్థలాల కోసం ఎదురుచూస్తున్నందున డీఎంఎఫ్ నిధులతోనైనా స్థలం కొనుగోలు చేసి ఇవ్వాలన్నారు.

పర్యావరణ ప్రేమికుడు మొక్కల రాజశేఖర్, డెస్క్ జర్నలిస్ట్ ఏకాంబరరావు, తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ నాయకుడు సొప్పరి క్రాంతి మాట్లాడగా.. వివిధ సంఘాల నాయకులు బండారి సాగర్, బుర్ర సతీష్, కొల హరీష్, ముత్యాల రాజేష్, దద్దగూటి కిరణ్, ఆచార్య మద్దెల శివకుమార్ సంఘీభావం తెలిపారు. కాగా, దీక్షలో ఇటీవల మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబీకులు పాల్గొని ప్రభుత్వం తమకు ఇళ్లస్థలాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

అప్పుడు అడ్డుకున్నది వారే... గత పదేళ్లలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అవకాశం ఉన్నా అడ్డుకున్న వారే ఇప్పుడు తప్పుదోవ పట్టించేలా మాట్లాడడం సరికాదని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడి రేగా కాంతారావు జిల్లాలోని జర్నలిస్టులందరికీ ఒకే చోట ఇళ్ల స్థలం ఇవ్వాలనే ఆలోచన చేస్తే ఆ ఘనత ఆయనకు దక్కకుండా కొందరు అడ్డుకున్నారని, సింగరేణి సంస్థతో మాట్లాడి నామమాత్రపు ధరతో స్థలాలు ఇచ్చే అవకాశం ఉన్నా పట్టించుకోలేదన్నారు. కాగా, ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేలా తమ ప్రభుత్వం విధివిధానాలు రూపొందిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

కొత్తగూడెంటౌన్: 2025–2026 కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఎన్నికలను గురువారం నిర్వహించనున్నట్లు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ పలివెల గణేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు కేటగిరిలలో దాదాపు 41 మంది పోటీలో నిలిచారని తెలిపారు.

బీఎస్పీ పట్టణ అధ్యక్షుడిగా ప్రవీణ్ కుమార్



పాల్వంచ: బహుజన సమాజ్ పార్టీ పాల్వంచ పట్టణ అధ్యక్షుడిగా కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్ నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా అధ్యక్షుడు తడికల శివకుమార్ నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ... పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్య పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలకు వంట సామగ్రి పంపిణీ

ఇల్లెందురూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజన వంట సామగ్రిని ప్రభుత్వం బుధవారం మండల విద్యా వనరుల కేంద్రానికి సరఫరా చేసింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాత్రల వివరాలను ప్రతీ పాఠశాల నుంచి సేకరించారు. ఈ ప్రకారం వంట సామగ్రిని ఎంఈఓ టీవీఆర్ ఎన్ స్వామి హెచ్ఎంలకు అందజేశారు.

సీతారామ నీటి కోసం ఆందోళనలు



మాట్లాడుతున్న మధు

ఇల్లెందు: ముగ్గురు మంత్రులు కలిసి సీతారామ ప్రాజెక్టు నీటిని ఖమ్మం జిల్లాకు తరలిస్తున్నారని, ఎన్డీ ఆధ్వర్యంలో సీతారామ ప్రాజెక్టు నీటిని భద్రాద్రి, మహ–బాద్, ములుగు జిల్లాలకు అందించేలా దశలవారీ ఆందోళనకు శ్రీకారం చుట్టినట్లు ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు వెల్లడించారు. బుధవారం ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... రీడిజైన్‌లో సీతారామలో 'రోళ్లపాడు'ప్రాజెక్టు లేకుండా పోయిందన్నారు. రోళ్లపాడుకు అటవీ అనుమతులు, పర్యావరణ అనుమతులు లేవంటూ సాకులు చూపుతున్నారని తెలిపారు. 2016 ఫిబ్రవరి 16న సీఎం కేసీఆర్ స్వయంగా రోళ్లపాడుకు వచ్చి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. సీతారామ ప్రాజెక్టు ఆరు లక్షల ఎకరాలకు నీరు అందిస్తుందని ప్రకటించిన పాలకులు 2018లో డిజైన్ మార్చి రూ.13,384 కోట్లుగా చేశారని, రెండు లక్షలు ఎకరాలకు మాత్రమే నీరును అందిస్తున్నట్లు తెలిపారు. రీడిజైన్ పేరుతో తలపెట్టిన ప్రాజెక్టును ఆదివాసీ, గిరిజన, ప్రజాసంఘాలు, రాజకీయ పక్షాలతో కలిసి ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తుపాకుల నాగేశ్వరరావు, పొడుగు నర్సింహారావు, హర్‌జ్యా, రాసుద్దీన్, తోడేటి నాగేశ్వరరావు, కె.సారంగపాణి, ఆర్.అంజయ్య, సూర్నపాక నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సంతూ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని గుడిసెవాసుల నిరసన



మాట్లాడుతున్న అబ్దుల్ నబీ

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెవాసులు చేపట్టిన రిలే దీక్షలు బుధవారం రెండోరోజుకు చేరుకున్నాయి. సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. ఆరేళ్ల క్రితం భూములను ఆక్రమించుకొని పేదలు గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. నాటి నుంచి తాము నివసిస్తున్న స్థలాలపై హక్కులు కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ పలు దఫాలుగా ఆందోళనలు చేసి అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారని గుర్తుచేశారు. ఎండలు మండుతున్నా గుడిసెవాసులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, వజ్జ సురేష్ పాల్గొన్నారు.

స్కూల్ ప్రారంభం రోజునే యూనిఫాం

ఇల్లెందురూరల్: వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేసేలా పొదుపు సంఘాల మహిళలు యుద్ధప్రాతిపదికన కుట్టడం పూర్తి చేయాలని సెర్ప్ ఏపీఎం దుర్గారావు సూచించారు. సెర్ప్ కార్యాలయంలో బుధవారం యూనిఫాం కుట్టుకు సంబంధించిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 84 పాఠశాలల్లో 2,611 మంది విద్యార్థులకు సరిపడా దుస్తులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సేకరించిన కొలతలకు అనుగుణంగా నిబంధనలకు లోబడి పాఠశాలల రీఓపెనింగ్ తేదీ నాటికి స్టిచ్చింగ్ పూర్తి చేయాలన్నారు. దీనికోసం అవసరమైన సామగ్రి, యంత్ర పరికరాలు, రుణ సహాయం తదితర అంశాలకు సంబంధించి ఆయా కేంద్రాల ప్రతినిధులు తమ ప్రతిపాదనలను త్వరితగతిన అందజేయాలని సూచించారు. సమావేశంలో మండల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సౌజన్య, సీసీలు స్వర్ణలత, లాలయ్య, భూలక్ష్మి, కొమ్మాలు, అకౌంటెంట్ నందకుమారి, శిక్షణ పొందిన సభ్యులు కళావతి, లక్ష్మి, గోపికరాణి, దీపరాణి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

టేకులపల్లి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇల్లెందు డీఎస్పీ ఎన్ చంద్రభాను అన్నారు. ఈ మేరకు ఎస్పీ ఆదేశాలతో బుధవారం ఇల్లెందు డీఎస్పీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వాగొడ్డుతండా, బీ కాలనీతండాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డన్ సెర్చ్) కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి డ్రగ్స్‌ని పసిగట్టే స్నిఫర్ డాగ్ చేత తనిఖీలు చేపట్టారు. పత్రాలు లేని 36 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ... ప్రజలు సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం పిన్ నంబర్లు, ఓటీపీ వివరాలు చెప్పొద్దన్నారు. ఆశ చూపిస్తే వాటికి ఆకర్షితులు కావొద్దని తెలిపారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేయాలని చెప్పారు. గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. గ్రామాల్లో గంజాయి సాగుకు పాల్పడినా, రవాణా చేసినా ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దవుతాయని తెలిపారు. ఐపీఎల్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ జోలికి వెళ్లొద్దన్నారు. ఈ సీఐ టి.సురేష్, టేకులపల్లి, బోడు, ఆళ్లపల్లి ఎస్ఐలు పి.సురేష్, పి.శ్రీకాంత్, రతీష్, ఆర్ఎస్ఐ కిషన్, 50 మంది పోలీసులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి

జూలూరుపాడు: తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపట్టామన్నారు. ఇందుకు కలెక్టర్ మండలానికి రూ.40 లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ నిధులతో 5 సింగిల్ ఫేజ్, 3 త్రీఫేజ్ మోటార్లు, బోర్ వెల్, చేతి పంపులు, పైపులైన్ మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు. గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. టెలీకాన్ఫరెన్స్ ద్వారా పంచాయతీ కార్యదర్శుల నుంచి సమాచారం తెలుసుకుంటున్నామన్నారు. అదేవిధంగా ఉపాధి పనుల కోసం కూలీల సంఖ్య గణనీయంగా పెంచేవిధంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ తులసీరామ్, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్ పాల్గొన్నారు.

కార్మికులను ఉద్యోగులుగా తీసుకోవాలి



దీక్షలో పాల్గొన్న నిర్మాణ కార్మికులు

పాల్వంచ: కేటీపీఎస్ 6వ దశ కర్మాగారంలో పనిచేసిన నిర్మాణ కార్మికులను ఉద్యోగులుగా తీసుకుని జీవనోపాధి కల్పించాలని కార్మిక సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో నిరసన దీక్ష చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ... నిర్మాణ కార్మికులు 450 మందికి రెగ్యులర్‌గా జీవనోపాధి కల్పిస్తామని అప్పటి సీఈ, ఐటీడీఏ పీఓ, జెన్‌కో హెచ్ఆర్ డైరెక్టర్లు రాతపూర్వక హామీ ఇచ్చి విస్మరించారన్నారు. నిర్మాణంలో పనిచేయడంతో పాటు ఐడీ నంబర్లు ఉన్న 318 మందికి న్యాయం చేయాలన్నారు. కర్మాగారంలో పనిచేయని అనేక మంది దొడ్డిదారిన ఉద్యోగాలు పొందారని, అర్హులను ఆర్టిజన్లుగా గుర్తించకపోవడం దారుణం అన్నారు. కార్యక్రమంలో వి.హతీరాం, బి.మురళీకృష్ణ, ఎస్ఏ.రెహమాన్, ఎన్.మల్లేష్, చంటి, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, రవి, జమున, సంపత్, శాంతి, యాకూబ్ పాషా, భట్టు శ్రీను, రవీందర్, శివ, చందు, చంద్రు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాతినిధ్య సంఘంతో సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో బుధవారం ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టీయూసీ) కార్పొరేట్ ఏరియా ఉపాధ్యక్షుడు పీతాంబరంతో కార్పొరేట్ ఐఆర్‌పీఎం అధికారులు నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. ఏరియాలోని వివిధ డిపార్ట్‌మెంట్ల సమస్యలపై చర్చించారు. సమస్యలపై చర్చించి సంస్థ పరిధిలో ఉన్న మేరకు వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం)కవితా నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ ఎం.ఉష, ఏజీఎం (ఐఈ) సీహెచ్ వెంకయ్య, ఏజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, డీజీఎం కే.అజయ్‌కుమార్, డీజీఎం పర్సనల్ బి.రాజగోపాల్, డీజీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

ముస్లింలకు పోలీసుల ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న డీఎస్పీ, సీఐ తదితరులు

ఇల్లెందు: పట్టణ ప్రజలు క్రమశిక్షణతో సుఖశాంతులతో ఉండాలని డీఎస్పీ ఎన్.చంద్రభాను ఆకాంక్షించారు. బుధవారం ఇల్లెందు ఆంబజార్ మజీద్‌లో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో డీఎస్పీ, సీఐ బత్తుల సత్యనారాయణ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్ష ఉంటూ మానవాళికి మేలు జరుగాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తారని, అలాంటి పవిత్ర మాసంలో వారికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయటం వారి త్యాగానికి, ఐక్యతకు చిహ్నమన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో వారితో కలిసి పాలు పంచుకోవటం మనందరి అదృష్టమన్నారు. ముస్లింలు కూడా తమతోటి వారేనని వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుని చేదోడుగా ఉండాలని పేర్కొన్నారు. ఇబ్రహీం, ఇనాయతుల్లా రష్థి, హబీబ్, హనీఫ్, సిరాజ్, గౌస్, ఎస్‌కే జానీపాషా, ఎస్ఐలు నాగుల్‌మీరా ఖాన్, సందీప్‌కుమార్, సూర్య పాల్గొన్నారు.

కార్మికుల పనివేళలు మార్చండి..

- పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు
- ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలి
- ఒక్కపూట పనులు కేటాయించాలని కార్మికుల వినతి



సీహెచ్‌పీ బెల్ట్ వద్ద ఎండలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): ఎండలు పెరిగి, కార్మికవాడల్లో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో సింగరేణిలోని వివిధ విభాగాలలో పనిచేసే సుమారు 28 వేల కాంట్రాక్ట్ కార్మికులకు పనివేళలు మార్చాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు, కాంట్రాక్ట్ కార్మికులు కోరుతున్నారు. ఈ మేరకు కొన్ని ఏరియాల్లో జీఎంలకు వినతిపత్రాలు కూడా అందజేశారు. ప్రధానంగా కార్మికవాడల్లో రోజురోజుకు అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావటం, కార్మికులు వడదెబ్బకు గురికావటం, ఎండలు ఉన్నప్పటికీ వారికి సరైన సదుపాయాన్ని యాజమాన్యం కల్పించక పోవటం, ఏప్రిల్ రానుండడంతో తీవ్రమైన ఎండలో పనులు చేయటం వల్ల సొమ్మసిల్లి పడిపోయే ప్రమాదం ఉన్నందున వారికి ఒక్కపూట పనులు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పని గంటలు మార్చాలని కోరారు. అదేవిధంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ఇప్పించాలని, దీంతోపాటు క్యాంటిన్లలో కార్మికులకు సరిపడా టిఫిన్, కాఫీలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై జీఎం సివిల్ సూర్యనారాయణను సాక్షి వివరణ కోరగా... సంస్థ ఉన్నతాధికారులతో చర్చించి, ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సర్క్యులర్ జారీ చేస్తామన్నారు.

ఏప్రిల్, మేలో పనివేళలు మార్చాలి..



కార్మికవాడల్లో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో సింగరేణిలోని వివిధ విభాగాలలో పనిచేసే సుమారు 28 వేల కాంట్రాక్ట్ కార్మికులకు పనివేళలు మార్చాలి. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఏప్రిల్, మే నెలలో పనిగంటలు మారుస్తున్నట్లు, ప్రతీ సంవత్సరం ఈపాటికే కంపెనీ నుంచి సర్క్యులర్ జారీ చేసేవారు. కానీ ఈ ఏడాది ఇంకా జారీ చేయకపోవటం శోచనీయం.

– యాకూబ్‌షావలీ, ప్రగతిశీల కాంట్రాక్ట్ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఓఆర్ఎస్, మజ్జిగ పంపిణీ చేయాలి..



సింగరేణి వ్యాప్తంగా సివిక్, సివిల్, ఓబీ, వర్క్‌షాప్, సీహెచ్‌పీ, ఇతర విభాగాలలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు పర్మనెంట్ కార్మికులతోపాటు, ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు, పంపిణీ చేయాలని, అదేవిధంగా ప్రొడక్షన్ లింక్ ఉన్న విభాగాలలో టిఫిన్, కాఫీలు క్యాంటిన్లలో అందించాలి. కనీస వేతనాలు చెల్లించటంలో జాప్యం చేస్తున్న యాజమాన్యం కనీస సౌకర్యాలనైనా కల్పించాలి.

– గౌని నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి